క్లుప్తంగా

ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టొద్దు

ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): రైతులు తమ ధాన్యాన్ని రోడ్డుపై పోయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ రోడ్ల మీద ఉండే ధాన్యం కుప్పలతో ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్ల మీద ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్లటి కవర్ కప్పేసి, చుట్టూ రాళ్లు పెట్టి వెళ్తుండటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు రైతులు బావి దగ్గర, ఇళ్ల వద్ద, ఇతర ప్రదేశాలలో ధాన్యం ఆరబెట్టడానికి ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ముదిరాజ్ సంఘం గజ్వేల్ అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్ అన్నారు. తూప్రాన్ రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రాజశేఖర్, సరరేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాలుగేళ్ల నుంచి ప్రతియేటా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రాజు, తిరుపతి, బీరయ్య, యాదగిరి, రాజయ్య, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా ఆరాధన దినోత్సవం



గీతాలు ఆలపిస్తున్న నాయకులు

హుస్నాబాద్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తాలో సత్యసాయి బాబా 14వ ఆరాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమితి సభ్యులు ఆయన చిత్రపటానికి గురువారం పూల మాలలు వేశారు. ఓంకారం భజన కార్యక్రమం నిర్వహించి అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు, కన్వీనర్ కొత్తపల్లి రవీందర్, రామిని వైకుంఠం, యాదగిరిరెడ్డి, సుధాకర్‌రావు, దొడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు పీపీకి సత్కారం



జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా నియమితులైన జీవన్ రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణ ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కలీమొద్దీన్, రాజువీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్ రుచితకు సన్మానం



రుచితను సన్మానిస్తున్న నాయకులు

దుబ్బాక: ఇంటర్ బైపీసీలో టాపర్‌గా నిలిచిన పట్టణానికి చెందిన గడ్డమీది రుచితను ధర్మ స్టూడెంట్స్ యూనియన్, ధర్మ మహిళ జాగృతి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సన్మానించారు. అణగారిన వర్గాలకు చెందిన రుచిత ఇంటర్‌లో టాపర్‌గా నిలవడంపై ప్రశంసించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు రేణుక, ప్రభాకర్ ఆయా సంఘాల నాయకులు ప్రసన్న మహారాణి, పరమేశ్వరి, లత, పిరాజి నాయక్, ప్రభాకర్, రాజన్, చందు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు ‘మద్దతు’ కరువు

కోహెడలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇక చేసేది లేక రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కనీస మద్దతు ధర పొందలేక తీవ్రంగా నష్టపోతున్నారు.

- ఐదేళ్లుగా కానరాని కొనుగోలు కేంద్రం
- ఈ యేడాది 2,540 ఎకరాల్లో సాగు
- ధాన్యం దళారుల పాలు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



కోహెడలో ప్రైవేటు వ్యాపారులకు మొక్కజొన్న విక్రయిస్తున్న రైతు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ పీఏసీఎస్(ప్యాక్స్) ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో రైతులు ఆ కొనుగోలు కేంద్రంలో తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందారు. అయితే ఆ తర్వాత కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలేదు. నిజానికి యేటా రెండుసార్లు కేంద్రాలు నిర్వహించాల్సి ఉంటుంది. కాని అది జగరడం లేదని రైతులు వాపోతున్నారు.

మార్కెట్ ఆదాయానికి గండి

కోహెడ వ్యవసాయ మార్కెట్, హుస్నాబాద్, సిద్దిపేట మార్కెట్‌లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రవాణా ఖర్చులు అధికం కావడంతో రైతులు స్థానిక వ్యాపారులనే ఆశ్రయించక తప్పడంలేదు. వ్యాపారులు అదే అదునుగా చేసుకొని రైతుల నుంచి అందినంతగా దోచుకుంటున్నారు. మార్కెట్ ధర కంటే దళారులు కింటాలుకు రూ.300 కంటే తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో కోహెడ, హుస్నాబాద్, సిద్దిపేట మార్కెట్‌లకు ఆదాయంలో గండి పడుతోంది.

2,540 ఎకరాల్లో సాగు

మండల వ్యాప్తంగా ఈ యేడాది 2,540 ఎకరాలలో రైతులు మొక్కజొన్న సాగుచేశారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలో కోహెడ మండల వ్యవసాయ, మార్కెట్ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించారని రైతులు మండిపడుతున్నారు. యాసంగి, వర్షాకాలంలోను అధికారుల నుంచి అనుమతి తీసుకొని ధాన్యం కోనుగోలు చేసి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొక్కజొన్న కొనుగోలు చేయాలి



ప్రభుత్వం మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలి. హుస్నాబాద్, సిద్దిపేట మార్కెట్‌లకు వెళ్లడంతో ఖర్చుల భారం అధికమవుతోంది. దీంతో దళారులు అడిగిన ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. కనీస మద్దతు ధర అందకపోడంతో నష్టపోతున్నాం. వ్యవసాయ, మార్కెట్ అధికారులు ప్రతి యేటా మొక్కజొన్న కొనుగోలు చేసేలా చూడాలి.

– పేర్యాల సంపత్‌రావు, రైతు కోహెడ

‘శిక్షణ’ను సద్వినియోగం చేసుకోండి



వర్గల్(గజ్వేల్): ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎంఈఓ సునీత

ఎంఈఓ సునీత

వర్గల్(గజ్వేల్): వేసవి సెలవుల్లో విద్యార్థుల ప్రతిభను మరింత పెంచేందుకు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సునీత సూచించారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు నృత్యం, చిత్ర లేఖనం, గానం, పద్య పఠనం, సూర్య నమస్కారాలు, యోగ, మెడిటేషన్‌పై ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు మధుసూదన్, మారుతి, కనకయ్య, రజని, మల్లికార్జున్, భాగ్యలక్ష్మి, సరస్వతి, నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞానం

మిరుదొడ్డి(దుబ్బాక): సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు విజ్ఞానం పెంచడానికి దోహదం చేస్తాయని ఎంఈఓ ప్రవీణ్‌బాబు అన్నారు. మండల పరిధిలోని చెప్యాల, అల్వాల, అందె, కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలల్లో శిక్షణ శిబిరాలను ఆయన ప్రారంభించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, అనసూయ, రవీందర్‌రెడ్డి, విఠల్, కృష్ణమూర్తి, రామచంద్రం, శివకుమార్, విద్యాప్రకాశ్, వినోద, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపును ఎంఈఓ మహతిలక్ష్మి ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, డ్రాయింగ్, యోగపై శిక్షణ ఇస్తున్నారన్నారు. విద్యార్థులు క్యాంపునకు హాజరై నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. సంబంధించిన సామగ్రిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమకూర్చారు. కార్యక్రమంలో క్యాంపు డైరెక్టర్‌లు హెచ్‌ఎం శ్రీనివాస్, రజనీష్, పుల్లూరి ప్రభాకర్, శంకరాచారి, నజీర్, రవీందర్‌రెడ్డి, శోభారాణి, శ్రీనివాస్, బాలయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మక్తమాసాన్‌పల్లిలో..

గజ్వేల్: మండలంలోని మక్తమాసాన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం పి.నర్సింహులు మాట్లాడుతూ ఇప్పటికే శిబిరంలో 70 మంది చేరగా, వారికి 12 అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత, పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్షుడు నాగరాజుగౌడ్, ఉపాధ్యాయురాలు పద్మ, పంచాయతీ కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

40రోజులు కొనసాగేలా ఏర్పాట్లు

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్లో హెచ్‌ఎం పెద్ది విఠల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. పీఈటీగా వాలీ బాల్, ఖో–ఖో వంటి క్రీడలపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1న ఉచిత వైద్య శిబిరం

సిద్దిపేటజోన్: చేనేత కార్మికులకు మే 1న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధికార ప్రతినిధి రాపోలు జగన్, కన్వీనర్ వనం శాంతికుమార్, తెలంగాణశాఖ అధ్యక్షుడు రాజేశం, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌లు తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నీలకంటేశ్వర దేవాలయం కమ్యూనిటీ హాల్‌లో శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. వైద్యులు స్వామి, గణేశ్, ఫెడరేషన్ ప్రతినిధులు లక్ష్మిరాజం, నర్సింహులు, యోగి, రాజేశం, శ్రీనివాస్, మల్లేశం, వెంకట్ పాల్గొన్నారు.

రజతోత్సవాన్ని విజయవంతం చేద్దాం

మాజీ ఎంపీపీ అమరావతి



అమరావతి

గజ్వేల్‌రూరల్: కేసీఆర్ నేతృత్వంలో సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయని మాజీ ఎంపీపీ దాసరి అమరావతి అన్నారు. మాజీ వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణ, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయులుతో కలిసి గురువారం ఆమె మాట్లాడారు. 27న వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.19వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కూంబింగ్ ఆపాలి

సిద్దిపేటకమాన్: కర్రెగుట్ట అడవుల్లో పోలీసులు జరుపుతున్న కూంబింగ్‌ను వెంటనే ఆపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం వారు మాట్లాడారు. ములుగు జిల్లా వెంకటాపూర్ నుంచి చత్తీస్‌గడ్ వరకు విస్తరించి ఉన్న అడవుల్లో మావోయిస్టులు ఉన్నారంటూ పోలీసు బలగాలు చుట్టుముట్టడం దారుణం అన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూపతి, సత్తయ్య, నర్సింహులు, రాములు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే శిక్షణ

క్రీడాజ్యోతి ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్



క్రీడాకారులతో ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని, ఆటల్లో రాణించాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోగల ఉన్నత పాఠశాలలో నిర్వహించతలపెట్టిన శిక్షణ శిబిరంలో ఫౌండేషన్ తరఫున ఎంఈఓ కృష్ణతో కలిసి గురువారం ఆయన వాలీబాల్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారుల అభ్యున్నతి కోసం తమవంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు విజయరేఖ, గోవర్ధన్‌రెడ్డి, నరేశ్‌కుమార్, నవీన్, వాలీబాల్ కోచ్ ప్రభు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవాలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల, జప్తినాచారం గ్రామాల్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామంలో ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి వాహన సిబ్బందికి అందజేయాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రమయంగా ఉండేలా చూసుకోవాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

◆ అండగా ఉంటా..

దుబ్బాకటౌన్: పదవిలో లేకున్నా ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని మాజీ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి అన్నారు. చెల్లాపూర్ 3వ వార్డుకు చెందిన కాపురబోయిన అభిలాష్‌కు మంజూరైన రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును గురువారం మాజీ కౌన్సిలర్ మల్లారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, మహేందర్‌రెడ్డి, తిరుపతి, నరేశ్ తదితరులున్నారు.

◆ వేసవిలో దొంగలతో అప్రమత్తం

– సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: వేసవి కాలంలో దొంగలతో అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో పిల్లలకు సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలువేసి దూర ప్రయాణాలు చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కొత్త వారి కదలికలపై సమాచారం అందించాలని కోరారు. రాత్రి వేళల్లో పోలీసు సిబ్బందితో గస్తీ నిర్వహిస్తామని చెప్పారు. ఇంటి తాళాలు కిటికీల వద్ద పెట్టవద్దని, బంగారు ఆభరణాలు, నగదు ఇళ్లలో ఉంచుకోవద్దని సీపీ సూచించారు.

◆ కల్లాలు ఏర్పాటు చేయాలంటూ ఆందోళన



దుబ్బాక: ఆరుగాలం కష్టపడి పండించిన తమ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాలు లేక రోడ్లపైనే ఆధారపడాల్సి వస్తోందని, కల్లాలను ఏర్పాటు చేయాలని రైతులు ఆందోళనకు దిగారు. మండలంలోని శిలాజీనగర్‌లో గురువారం పలువురు రైతులు మాట్లాడుతూ కల్లాలు లేక రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లో కల్లాలు ఏర్పాటు చేయాలని కోరారు.

పరిశుభ్రత పాటించకపోతే చర్యలు

- బేకరీ యజమానికి రూ.2 వేల జరిమానా
- కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నరేశ్ తదితరులు

దుబ్బాకటౌన్: హోటళ్లు, బేకరీలలో పరిశుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. నాణ్యతలేని, చెడిపోయిన కేకులు, తినుబండారాలు విక్రయిస్తున్న రాఘవేంద్ర బెంగుళూర్ బేకరీపై చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్‌సీ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్ గురువారం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు బేకరీని తనిఖీచేసి యజమానికి రూ.2వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదన్నారు. బేకరీ యజమానికి మొదటి హెచ్చరికగా జరిమానా విధించామని చెప్పారు. ఆ యజమాని ఓ బాలుడితో పని చేయిస్తున్నాడని నరేశ్ ఆరోపించారు.

కాపాడుకునే బాధ్యత అందరిది

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకొనే బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎంగా పని చేసిన ఇందిర ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇందిర సహకారంతో పాఠశాలకు ఎల్‌ఈడీ ప్యానెల్‌తో పాటు విద్యార్థులకు ట్యాబ్‌లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత ఆయా గ్రామాల ప్రజలపైనే ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మంచి బోధన ఉంటుందని భావించి తల్లిదండ్రులు అనవసరమైన భారాన్ని నెత్తిన వేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల ప్రగతి రిపోర్టు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరానికిగాను పంపిణీ చేసే యూనిఫాంలను సకాలంలో పూర్తిచేసి అందించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని వీరన్నపేటలో యూనిఫాంలు కుట్టే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ నాటికి పూర్తిచేసి పాఠశాలకు పంపించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ కిష్టయ్య, స్థానిక ఉపాధ్యాయుడు కొండల్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బడిబాటలో ఎంఈఓ కిష్టయ్య



బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ కిష్టయ్య, ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి మరింత బలోపేతం చేయాలని ఎంఈఓ రచ్చ కిష్టయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చుంచనకోటలో గురువారం నిర్వహించిన ముందస్తు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు భోజనం, దుస్తులు, పుస్తకాలు, కంప్యూటర్ ఆధారిత బోధన అందిస్తున్నామని తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ హెచ్‌ఎంలు మురళీకృష్ణ, అంబాల వెంకటేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, అనిల్, సంతోష్, శ్రీధర్, జ్యోతి, శారద, రజిత, ఉషారాణి, శారద పాల్గొన్నారు.

కాసులాబాద్‌లో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, శివకుమార్, విద్యా ప్రకాశ్, రామచంద్రం, వినోద, అంగన్‌వాడీ టీచర్లు సునంద, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బటర్ మిల్క్‌తో బెటర్ హెల్త్

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన



బటర్‌మిల్క్‌ను చూపుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: వేసవిలో ఆరోగ్యవంతమైన అలవాట్లను ప్రోత్సహించాలని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత సూచించారు. కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ‘బటర్‌మిల్క్ ఫర్ బెటర్ హెల్త్’ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బటర్ మిల్క్ సేవించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ మధన్‌మోహన్ మాట్లాడుతూ బటర్‌మిల్క్ తీసుకోవడంతో జీర్ణవ్యవస్థ మెరుగవుతుందన్నారు. అందులోని ప్రొబయాటిక్స్, కాల్షియం, విటమిన్ బి12 వంటి పోషక విలువలతో ఆరోగ్యానికి అనేక లాభాలుంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సృజనాత్మక ఆరోగ్య పోస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది బటర్‌మిల్క్‌ను సేవించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, సీఓఈ డా.గోపాలసుదర్శనం, అధ్యాపకులు మధుసూదన్, రాణి, శైలజ, శ్రీధర్, శ్రీనివాస్, మహేశ్, శ్రద్ధానందం, శ్రీదేవి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

పహల్గామ్ అమరులకు నివాళులు



చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

చేర్యాల(సిద్దిపేట): పహల్గామ్ ఉగ్రదాడిలో అమరులైన వారికి స్థానిక కోర్టు ఆవరణలో గురువారం న్యాయమూర్తి కృష్ణతేజ, న్యాయవాదులు నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరెల్ల వీరమల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి పట్టణ కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విధుల బహిష్కరణ

దుబ్బాక: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ దుబ్బాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ దాడికి పాల్పడ్డ వారిని వెంటనే పట్టుకొని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రతాప్‌రెడ్డి, అశోక్, రామకృష్ణప్రభు, ఏజీపీ నాగరాజురెడ్డి, రేణుక, మహేశ్, చంద్రం, శ్రీనివాస్, సంతోష్, చరణ్‌తేజ, ప్రవీణ్‌కుమార్, జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి: హరికృష్ణ

సిద్దిపేటజోన్: పహల్గామ్ ఘటనలో నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ డిమాండ్ చేశారు. ముస్తాబాద్ చౌరస్తాలో ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయిన పర్యాటకులకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ హయాంలో జమ్మూకశ్మీర్‌లో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తు, నాయకులు వహీద్ ఖాన్, యాదగిరి, రియాజ్, ఆనంద్, కలీమ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: పహల్గామ్‌లో దాడుల్లో మృతులకు సంతాపంగా జిల్లా సోషల్ స్టడీస్ ఫోరం, పీఆర్టీయూల ఆధ్వర్యంలో గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ రాదారి నాగరాజు మాట్లాడుతూ దేశభద్రతకు భంగం కల్గించిన ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పూర్ణచందర్‌రావు, సమ్మయ్య, సత్యం, బాలస్వామి, భాస్కర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు విధులు బహిష్కరించి నల్ల రిబ్బన్‌లు ధరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్, న్యాయవాదులు సత్యనారాయణ, హరిచంద్ర, రామేశ్వర్‌రావు, సాయిబాబ, రాజేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.